క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. దత్తక్షేత్రం, ఆర్కే ఫర్నిచర్, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల, ముస్లిం మైనారిటీ కళాశాల, జ్యోతిబస్ నగర్, కేఎస్ఆర్ గార్డెన్, హనుమాన్ జంక్షన్, అడ్వకేట్స్ కాలనీ, హంటర్ రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్, ఎస్ఆర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, శాయంపేట, జేఎస్ఎం స్కూల్, శ్రీరామ కాలనీ, అవంతి స్కూల్, డీ కన్వెన్షన్ ప్రాంతం, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలివ్వాలి

కాశిబుగ్గ: గత ప్రభుత్వంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వెంటనే కార్పొరేషన్ రుణాలను వారి ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ దళిత నిరుపేద అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల యాదగిరి డిమాండ్ చేశారు. ఓ సిటీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018-2021వ ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వ పిలుపు మేరకు రుణాల కోసం అధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. ఇంతవరకు వారికి రుణాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అభయ హస్తం పథకం కింద దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలుచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రామోజీరావుకు ఘన నివాళి



విద్యారణ్యపురి: ప్రముఖ వ్యాపారవేత్త, రామోజీ గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతికి యోగా గురువు, సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నివాళి అర్పించారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ అనంత్‌కుమార్, బాధ్యులు సురేందర్, రాములు, అలీ, యోగా గురువు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెటర్ల నివాళి

వరంగల్ స్పోర్ట్స్: పద్మ విభూషణ్ రామోజీరావు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రికెటర్లు ఆదివారం నివాళి అర్పించారు. రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, కార్యవర్గ సభ్యుడు మట్టెడ కుమార్, డీఎస్ఏ క్రికెట్ కోచ్ ఎండీ.అఫ్జల్, క్రికెటర్లు బండారి ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో సర్కారు బడులు



కాశిబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పలు పాఠశాలలను ఇప్పటికే మూసివేశారు. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం పేరుతో స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వీటి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ఈనెల 10వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. కానీ, జిల్లాలోని కొన్ని పాఠశాలలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నగరంలో 7 పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 3 పాఠశాలలు సంవత్సరాలుగా సొంత భవనాలకు నోచుకోవడం లేదు. అరకొర వసతుల మధ్య బోధన చేస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, బ్లాక్‌బోర్డులు లేవు. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. రెండు సంవత్సరాల నుంచి అద్దె బడ్జెట్ ప్రభుత్వం నుంచి రావడం లేదు. నెలకు 1,35,680 అద్దె చెల్లించాల్సి ఉంది.

మురికివాడల పిల్లలు విద్యకు దూరం..

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలనే లక్ష్యం మంచిదే. కానీ, జిల్లా అధికారులు దృష్టి సారించపోవడంతో మురికివాడల్లోనే అనేక మంది పిల్లలు విద్యకు దూరమవుతున్నారని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలల సమస్యలను కలెక్టర్ పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. ఆ పాఠశాలల్లో సమస్యలను గుర్తించాం. త్వరలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తాం.

– డి.వాసంతి, జిల్లా విద్యాశాఖ అధికారి

నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారంపై హర్షం



పోచమ్మమైదాన్‌లో బీజేపీ శ్రేణుల సంబురాలు



హనుమకొండ చౌరస్తాలో..



ఖిలా వరంగల్: శంభునిపేటలో..



హసన్‌పర్తి: సంబురాల్లో నాయకులు



మడికొండ చౌరస్తాలో..

వరంగల్: 3వ సారి పీఎంగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నగర వ్యాప్తంగా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఆదివారం రాత్రి బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, సముద్రాల పరమేశ్వర్, పోలెపాక మార్టిన్ లూథర్, చింతల అనిల్, బైరి మురళీకృష్ణ, భరత్, రతన్, అపురూప రాజనీష్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తాలో..

హన్మకొండ చౌరస్తా: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ సారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా హనుమకొండ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, జయంత్ లాల్, జితేందర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నర్సింగరావు, అర్చన, భరత్, చాంద్ పాషా, తులసి, కవిత, వాణి, సులోచన, ఉష, తదితరులు పాల్గొన్నారు.

33, 34, 41వ డివిజన్లలో..

ఖిలా వరంగల్: నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో బీజేపీ శ్రేణులు ఆదివారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నారు. 34వ డివిజన్‌లో మహమ్మద్ రఫీ, 41 డివిజన్ కర్నె రవీందర్, 33వ డివిజన్‌లో ముత్తినేని శ్రీనివాస్, మాదాసి రాజు, రాజేష్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైరి శ్యాంసుందర్, శక్తి ఇన్‌చార్జ్ కందుకూరి విజయ్‌కుమార్, బోడకుంట్ల శివశంకర్, కర్నె వాసు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: ప్రధానమంత్రిగా మోదీ మూడవ సారి ప్రమాణ స్వీకారం చేయడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, నాయకులు కాలె యాదగిరి, మేకల హరిశంకర్, తిరుపతి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మూడవ సారి ప్రధాన మంత్రిగా మోదీ మోదీ ప్రమాణం స్వీకారం చేయడాన్ని హర్షిస్తూ మడికొండలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పానగోటి వెంకట్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం మహేందర్, కందుకూరి బాలరాజు, కెటిక సదానందం, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, బైరి సతీష్, ఎలగొండ శివ, వస్కుల మౌళి, నరేష్, దార ధనుంజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఛిద్రమవుతున్న రహదారులు



గ్రానైట్ లారీని అడ్డుకుని నిరసన తెలుపుతున్న స్థానికులు (ఫైల్)

- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ లారీల రాకపోకలు
- ధ్వంసమవుతున్న రోడ్లు, కల్వర్టులు
- దృష్టి సారించని అధికార యంత్రాంగం



బండరాయితో వెళ్తున్న లారీ

కాజీపేట: రోడ్డు రవాణా నిబంధనలను ఉల్లంఘించి పలు వాహనదారులు రహదారులపై యథేచ్ఛగా ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారుల కళ్ల ముందు నుంచే నిత్యం భారీ వాహనాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు ప్రయాణికులు అదనంగా ఉంటేనే పట్టుకుని ఆటోలు, జీపుల యజమానులపై అధిక మొత్తంలో జరిమానాలు విధించే రవాణా, ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా బండరాళ్లతో ప్రయాణించే లారీలు కన్పించకపోవడం శోచనీయమని పలువురు ధ్వజమెత్తుతున్నారు.

రాత్రివేళలో రాకపోకలు

వరంగల్ – హైదరాబాద్ రహదారిపై కాజీపేట మీదుగా నిత్యం రాత్రివేళల్లో లెక్కకు మించిన భారీ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వందల కొద్దీ టన్నుల బరువు గల బండరాళ్లతో కూడిన ఈ వాహనాలు రేయింబవళ్లు తిరుగుతుండడంతో ఏ వైపు నుంచి ఏ ముప్పు వాటిల్లుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. లారీలపై వాటిని తాళ్లతో కట్టకపోవడంతో మూలమలుపులు, గుంతల వద్ద ఎక్కడ కింద పడతాయో తెలియని దుస్థితి నెలకొంది.

పొంచిఉన్న ముప్పు

బండరాళ్లతో వచ్చే ఈ భారీ వాహనాలను రహదారిపై ఉన్న కల్వర్టులు, మినీబ్రిడ్జిలు తట్టుకుని నిలబడుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బండరాళ్ల బరువు మోయలేక కల్వర్టులు, వంతెనలు కూలిపోతే జరిగే ప్రాణ, ఆస్తి నష్టాలను అధికారులు అంచనా వేయకపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. మూలమలుపుల వద్ద ఓవర్ లోడ్‌తో ఉన్న లారీలను కట్ చేయడం డ్రైవర్లకు తలకుమించిన భారంగా మారుతోంది. ఇటీవల వడ్డెపల్లి చెరువు కట్ట సమీపంలో గ్రానైట్ ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడటంతో రెండు రోజులపాటు ఆ రహదారిపై రెండు రోజులు ఇతర వాహనాల రాకపోకలు నిల్చిపోయాయి. దీంతోపాటు పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే గేట్ వాల్వ్ బండరాళ్లు పడి పనిచేయకపోవడంతో మూడురోజులు నీటి సరఫరా ఆగిపోయింది. భారీ వాహనాలను అధికారులు ఆపి తనిఖీలు చేస్తే ఎంత ఓవర్‌లోడ్‌తో ప్రయాణం చేస్తున్నాయో వెలుగులోకి వస్తాయని ప్రజలు అంటున్నారు.

గ్రానైట్ లారీల అడ్డగింత

కాజీపేట పట్టణంలో రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం వేసిన సీసీ రోడ్లపై గ్రానైట్ లారీలు రాకపోకలు సాగించడం పట్ల పలు కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవల అడ్డుకున్నారు. సీసీ రోడ్డు భారీ లారీల వల్ల ధ్వంసం అవుతున్నాయని ఆరోపిస్తూ లారీలను అడ్డుకోవడం వివాదాస్పదంగా మారి కేసు పోలీస్ స్టేషన్‌కు చేరింది. అటు అధికారులు.. ఇటు నాయకులు జోక్యం చేసుకుని పరిష్కార మార్గం చూపకపోవడంతో రెండు వర్గాలు వారు రగిలిపోతున్నాయి.

భారీ వాహనాలను నియంత్రించాలి



భారీ వాహనాల రాకపోకలతో ప్రజల్లో ఒకరకమైన భయాందోళనలు ఉన్నాయి. అధికారులు రంగంలోకి దిగి నిబంధనలను అతిక్రమిస్తున్న వాహనాలను నియంత్రించాలి. లేకుంటే సీసీ, తారు రోడ్డు పూర్తిగా ధ్వంసంకావడం తథ్యం. వాటికి నిదర్శనమే అధ్వానంగా మారిన మడికొండ – ధర్మసాగర్ రహదారి. గ్రానైట్ లారీల కారణంగా ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

– మేకల రవీందర్, కాజీపేట

ఎడాపెడా.. చలాన్ల వాత



● ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు

కాజీపేట: ట్రైసిటీలో ఒకటైన కాజీపేట పట్టణంలో పోలీసులు చలానాలు విధిస్తున్న తీరుపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం వరకు వెసులుబాటు కల్పించడంతో 90 శాతం రాయితీపై ఆన్‌లైన్ చలాన్ల బకాయిలు మొత్తం చెల్లించామని, ఆ తర్వాత నుంచి పట్టణంలో పోలీసు సిబ్బంది అత్యుత్సాహం మొదలైందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పట్టణ రహదారులపై లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు మకాం వేసి యథేచ్ఛగా వచ్చిపోయే వాహనాలను ఫొటోలు తీయడమే పనిగా పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాజీపేట రైల్వే వంతెన సమీపంలో డీ – మార్ట్ ఎదుట ఉన్న పోలీస్ అవుట్ పోస్టులో విధి నిర్వహణలో ఉంటున్న కానిస్టేబుల్ నింపాదిగా కూర్చొని హ్యాండ్ కెమెరాతో హెల్మెట్ లేని వాహనదారుల వాహనాలను ఫొటోలు తీయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాశిబుగ్గ: వరంగల్‌లోని రామకృష్ణ విద్యాలయంలో 1987 – 88లో పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రైల్వే స్టేషన్ రోడ్డులోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకచోట చేరుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పూర్వ ఉపాధ్యాయులు తాళ్ల పద్మావతి కళాశాల అధినేత తాళ్ల మల్లేశం, దుర్గ, ఇందిర, ప్రేమలత, హరి, నారాయణ, రాజమణి, శోభారాణి, విమల, శివప్రసాద్, పూర్వ విద్యార్థులు రామ శ్రీకాంత్, ముకుల సతీష్, వంగరి శ్రీధర్, గుండు శ్రీనివాస్, యాదగిరి, వేణు, ప్రభ, సునీత, మాధవి, యశోద, లత, వాణి, సుజాత, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పేర్కొనాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరగుతున్న బదిలీలు, పదోన్నతుల కోసం తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు, స్పౌజ్ కేటగిరీ పత్రాలు సమర్పించిన వారిని తొలగించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించి పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు పల్లె శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు అభినందనలు



మల్లన్నను సన్మానిస్తున్న మున్నూరుకాపు బాధ్యులు

విద్యారణ్యపురి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల బాధ్యులు హైదరాబాద్‌లో ఆదివారం కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం సాధించటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, వరంగల్ జిల్లా కార్యదర్శి తోట చందర్‌రావు, బాధ్యులు మహేందర్, మోతుకూరు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: తీన్మార్ మల్లన్నను 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస భర్త రాంప్రసాద్ కలిసి అభినందనలు తెలిపారు.

కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలి



వెంకటాద్రి స్వామిని పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న సదానందాచారి

హన్మకొండ కల్చరల్: కులమతాలకతీతంగా బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మునిమనవడు నొస్సం వెంకటాద్రి స్వామి అన్నారు. భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందాచారి, అర్చకుడు గూటోజు కేదారేశ్వచారి శిష్యబృందం పూర్ణకుంభంతో స్వాగతించి పాదపూజ చేశారు. ఓరుగల్లు విశ్వబ్రాహ్మణ గురుపీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వరంగల్ హంటర్‌రోడ్డులోని పద్మావతి గార్డెన్స్‌లో సమాజంపై కాలజ్ఞాన ప్రభావం అనే అంశంపై విశ్వకర్మ సదస్సు జరిగింది. విశ్వబ్రాహ్మణ గురుపీఠం కన్వీనర్ చొల్లేటి కృష్ణమాచారి అధ్యక్షతన జరిన సదస్సులో ముఖ్యఅతిథులుగా మఠాధిపతి వెంకటాద్రి స్వామి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొని ప్రసంగించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పదో తరగతి స్నేహితులు

వరంగల్: స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. వరంగల్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన గోలి వేణు గతనెల 31న మృతి చెందగా ఆదివారం దశదిన కర్మ నిర్వహించారు. ఆయనతో కలిసి నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేణు కుమారుడు సాయికిరణ్, కూతురు సిరిచందన, భార్య కల్పన, తల్లి రాజ్యలక్ష్మికి ఆర్థిక సాయం చేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మేరుగు ప్రతాప్, హరిప్రసాద్, శ్రీకాంత్, విజయ్, రఫీక్, లకుం శ్యామ్, క్యాతం రవీందర్, ముడుతనపల్లి సురేశ్, ధర్మాజీ రవి, గణేశ్, ఏకాంబరం, కుమారస్వామి, డి.సతీశ్, ఆకుల సంతోష్ పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో సమస్యల తిష్ట

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని కార్పొరేటర్, అధికారులు



కాకతీయకాలనీలో డ్రెయినేజీ నిర్మాణం లేక నిలిచిపోయిన మురుగునీరు



ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

హన్మకొండ చౌరస్తా: 9వ డివిజన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాల లేమితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికై మూడేళ్లు గడిచినా అభివృద్ధిని చీకటి శారద పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని చెబుతున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ (హనుమకొండ) పరిధిలోని 9వ డివిజన్‌లో న్యూరాయపుర, సుధానగర్, కాకతీయకాలనీ, కాకతీయకాలనీ ఫేజ్ –2, ఇందిరానగర్, గణేష్‌నగర్, రెడ్డికాలనీలు ఉన్నాయి. సుమారు 20 వేల జనాభా నివసిస్తుండగా, 11వేల పైచిలుకు ఓటర్లున్నారు. అధికశాతం పేద, మధ్య తరగతి నేపథ్యం గలవారు, దినసరి కూలీలు, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పేరుకుపోయిన సమస్యలు

డివిజన్‌లో అనేక సమస్యలు పేరుకుపోయాయి. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సమస్యలను పరిష్కరించడంలో కార్పొరేటర్ చీకటి శారద పూర్తిగా విఫలం అయ్యారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ భర్త ఆనంద్ తానే కార్పొరేటర్ వ్యవహరించడంతో ఆయనకు తమ సమస్యలు చెప్పుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు.

రోడ్డుపై మురుగునీరు పారుతోంది



మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఇంటికి వెళ్లే ప్రధాన దారిలో రోడ్డుపై మురుగునీరు పారుతోంది. కార్పొరేటర్ భర్త ఆనంద్ వచ్చి చూసినా ఇప్పటి వరకు ఆ సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డుపై మురుగు నీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– రాజేంద్రప్రసాద్, కాకతీయ కాలనీ

డ్రెయినేజీ దుర్వాసన వస్తోంది



కాకతీయకాలనీలో అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో మురుగునీరు రోడ్ల పైకి, ఖాళీ స్థలాల్లోకి వెళ్లి నిలుస్తోంది. దాంతో దుర్గంధం వస్తోంది. ఇలా అయితే వర్షాకాలంలో దోమలు, ఈగలతో రోగాల బారిన పడడం ఖాయం. ఈ విషయంపై స్థానిక కార్పొరేటర్, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– బబ్లీసింగ్, కాకతీయ కాలనీ

రూ.8 కోట్లతో అభివృద్ధి

నేను ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనేది అవాస్తవం. మూడేళ్ల కాలంలో డివిజన్‌లో సుమారు రూ.5 కోట్ల ఖర్చుతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. మరో రూ.3 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో కాకతీయకాలనీ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే నాలాపై వంతెన నిర్మాణం పూర్తిచేశాం. ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు, ప్రతిపాదనలను అధికారులకు అందజేశాం. సమస్య ఎదురైతే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తా..

– చీకటి శారద, కార్పొరేటర్, 9వ డివిజన్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

హన్మకొండ అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మొహమ్మద్ ముస్తాక్ నెహాల్ జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చన్నారు.

మదర్ థెరిస్సా హోంలో పండ్ల పంపిణీ

కాశిబుగ్గ: టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ మదర్ థెరిస్సా హోంలో అనాథలకు, క్రిస్టియన్ కాలనీలో పేదలకు వేర్వేరుగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. క్రిస్టియన్ కాలనీలో జరిగిన వేడుకలకు సినీ నిర్మాత శ్యామల గణేష్, డాక్టర్ మోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజయ్యారు.